పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 4.08.2014

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం కరీంనగర్ జిల్లాలో, గురువారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రెండు జిల్లాల్లో చేపట్టాల్సిన పనులు, పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి సచివాలయంలో సోమవారం సమీక్షించారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, కరీంనగర్ ఎంపి బి.వినోద్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ లతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తన పర్యటనకు నిర్ణీత లక్ష్యాలు, అర్థం, పరమార్థం వుండాలని కేసిఆర్ ఈ సందర్భంగా చెప్పారు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వివిధ ప్రభుత్వ పథకాల ప్రస్తుత స్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు తదితర అంశాలపై కూలంకషంగా చర్చిస్తానని అధికారులు కూడా పూర్తి వివరాలతో సమావేశాలకు రావాలని సూచించారు. ముఖ్య ప్రభుత్వ శాఖల రాష్ట్రస్థాయి ప్రధాన అధికారులతో పాటు ఎంపిడిఓ, తహశీల్దార్లు కూడా ఈ సమీక్షలో పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సూచనలు, సలహాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. జిల్లాలో మంచినీరు, విద్యుత్, రహదారులు, వైద్య ఆరోగ్యం, డ్రైనేజి, వీధిలైట్లు, హౌసింగ్, డంప్ యార్డులు, రింగ్ రోడ్డులు, మాస్టర్ ప్లాన్, బస్ స్టేషన్లు, పార్కులు, పర్యాటకం, విద్య తదితర అంశాలపై పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. జిల్లాకు చెందిన ఎంపిపి, జడ్పిటిసి, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమీషనర్లు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు ఈ సమీక్షలో పాల్గొనాలని చెప్పారు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లా కేంద్రాలలో డ్రైనేజి వ్యవస్థ అధ్వాన్నంగా వుందని వాటిపై సత్వరం దృష్టి పెట్టాలని కేసిఆర్ చెప్పారు.

కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో సిఎం పర్యటనకన్నా ఒకరోజు ముందే సిఎంఓ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ జిల్లాకు వెళ్లాలని కేసిఆర్ కోరారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జిల్లాలో, జిల్లా కేంద్రంలో చేయాల్సిన పనులపై స్మితాసబర్వాల్ క్షేత్ర పర్యటన జరిపి వాస్తవాలు సేకరిస్తారు. జిల్లా సమీక్ష సందర్భంగా నిర్ణయాలు తీసుకొంటారు. స్మితాసబర్వాల్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ముఖ్య అధికారులు కూడా సిఎం ఆదేశాలతో ఆయా జిల్లాలకు తరలివెళ్లనున్నారు. ఈ నెల 5న కరీంనగర్‌లో జరిగే సిఎం పర్యటన కోసం స్మితా సబర్వాల్

సోమవారమే కరీంనగర్ వెళ్లారు. అక్కడ కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. 5న ఉదయం కరీంనగర్ పట్టణంలో విస్తృతంగా పర్యటించి డ్రైనేజి వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రస్తుత స్థితిని, ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలను అధ్యయనం చేస్తారు. సిఎంకు నివేదిక అందిస్తారు. స్మితాసబర్వాల్ తో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా క్షేత్ర పర్యటనలో పాల్గొంటారు.

తెలంగాణ ఉద్యమానికి కరీంనగర్ ప్రాణం పోసిందని, 2001 సెప్టెంబర్ 17న అక్కడ నిర్వహించిన సభ ఇవాల తెలంగాణ సాధించిపెట్టిందని ముఖ్యమంత్రి చెప్పారు. కరీంనగర్‌తో తనకు బావోద్వేగ అనుబంధం వున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరంతో పాటు జిల్లా అభివృద్ధికి పాటు పడాల్సిన బాధ్యత తనకు వుందని చెప్పారు. మంగళవారం జరిగే రివ్యూ సందర్భంగా అప్పటికప్పుడు కొన్ని అనుమతులు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఎ

నిజామాబాద్ జిల్లాను వ్యవసాయ రంగంలో బాగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారు. 7న జరిగే నిజామాబాద్ పర్యటనలో భాగంగా ఆర్మూర్, అంకాపూర్, నిజామాబాద్ పట్టణాలను సందర్శిస్తానని చెప్పారు. అంకాపూర్ గ్రామాన్ని దేశమంతా ఆదర్శంగా తీసుకొని వ్యవసాయంలో పాఠాలు నేర్చుకునే విధంగా తీర్చిదిద్దాలనేది తన తపన అని ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. నిజామాబాద్ నగరంలో అండర్ డ్రైనేజి వ్యవస్థను సరిచేయాల్సి వుందని, రింగ్ రోడ్డు నిర్మించాలని, ఓ ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి తన మనోగతాన్ని వెల్లడించారు.

-----------------------------------------------------------------

**సిపిఆర్ఓ టు సిఎం**